క్లుప్తంగా

కామాక్షీ పీఠాధిపతి మృతికి పలువురి సంతాపం

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీకామాక్షీ పీఠం పీఠాధిపతి కామేశ మహర్షి మృతి చెందారని తెలియగానే కోనసీమలోని పలు ప్రాంతాలకు చెందిన అధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు సంతాపం తెలిపారు. అమలాపురానికి చెందిన అధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్‌శంకర్ గౌడ్, ఆర్‌ఎస్‌ఎస్ అయిదు జిల్లాల సంపర్క్ ప్రముఖ్ బులుసు జగదీష్, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోదశి గంగరాజు, కార్యదర్శి జీవీఎస్ కామేవ్వరరావు సంతాపం తెలిపారు.పట్టణానికి చెందిన ఏపీసీసీ నేత, ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పీఠాధిపతి మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణితో పాటు పట్టణానికి చెందిన పలువురి ప్రముఖులు కామాక్షీ పీఠానికి వచ్చి కామేశ మహర్షి పార్థీవ శరీరంపై పుష్పగుచ్ఛాలు ఉంచి సంతాపం తెలిపారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల సమ్మెకు సీఐటీయూ మద్దతు



సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్

అమలాపురం టౌన్: మున్సిపాలిటీ కార్యాలయం వద్ద విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న 50 మంది ఇంజినీరింగ్ వర్కర్లకు జిల్లా సీఐటీయూ మద్దతు ప్రకటించింది. జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ సమ్మె శిబిరాన్ని గురువారం సందర్శించి మద్దుతు ప్రకటించారు. వీరి సమ్మె ప్రభావం పలు వీధుల్లో తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణపై పడింది.

ఉత్సాహంగా చెస్ పోటీలు



చదరంగంలో పోటీ పడుతున్న విద్యార్థులు

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం స్థానిక శారదా విద్యానికేతన్ ప్రభుత్వ ఎయిడెడ్ హైస్కూల్‌లో చదరంగం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ స్కూల్స్ నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్ బహుమతులు అందజేశారు. ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి సామ్యూల్, రిటైర్డ్ సీఐ శివగణేష్, ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ వెంకటేశ్వరరావు, పీఈటీ చింతావెంకన్న పాల్గొన్నారు.

ఉత్సాహంగా బైక్ ర్యాలీ



యానాంలో సాగిన బైక్ ర్యాలీ

యానాం: నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడతానని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం యర్రాగార్డెన్స్‌లో శుక్రవారం జరగనున్న మల్లాడి పుట్టినరోజు సందర్భంగా తన స్వగృహం వద్ద బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. పాతబస్టాండ్, పరంపేట, దరియాలతిప్ప, కనకాలపేట, పిల్లారాయవీధి, భీమ్‌నగర్, సావిత్రినగర్, గిరియాంపేట తదితర ప్రాంతాల మీదుగా బైక్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి సామ్యూల్ పాల్గొన్నారు.

ఘనంగా లంకతల్లమ్మ దండాడింపు



లంకతల్లమ్మ అమ్మవారిని ఊయలలో ఉంచి జోలపాడుతున్న దృశ్యం

ముమ్మిడివరం: గ్రామ ప్రజల ఇలవేల్పు శ్రీలంక తల్లమ్మ దండాడింపు కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. గత నెల 15వ తేదీ నుంచి ప్రారంభమైన అమ్మవారి సంబరాలు గురువారం జరిగిన దండాడింపుతో ముగిశాయి. అమ్మవారి ఆలయం ఎదుట గల రావిచెట్టుకు కట్టిన ఊయలలో అమ్మవారిని ఉంచి జోల పాట నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ఆలయ ప్రవేశం చేయించారు. యువకులు బుక్కాలు జల్లుకుంటూ సందడి చేశారు. ఆలయాన్ని నూనె దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రాప మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద కూడా దండాడింపు ఘనంగా నిర్వహించారు.

ప్రభుత్వ జాగాలో దుకాణాల పాగా

- యథేచ్ఛగా సర్కారు స్థలాల కబ్జా
- చోద్యం చూస్తున్న అధికారులు

తాళ్లరేవు: ప్రభుత్వ స్థలాలు ఖాళీగా కనబడితేచాలు అక్రమార్కులు దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఆయా స్థలాల్లో పాగా వేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఆక్రమించిన స్థలాల్లో కొందరు వ్యాపారాలు సాగిస్తుండగా, కొందరు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఆర్‌అండ్‌బీ రహదారులు, జాతీయ రహదారుల చెంతన ఉన్న స్థలాలతోపాటు పంచాయతీ స్థలాలు, పంట కాలువ గట్లు, ఏటిగట్లను కూడా వదలకుండా అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నారు. పలు ప్రధాన కూడళ్లలో ఈ ఆక్రమణల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. జాతీయ రహదారి 216లోని పలు ప్రధాన కూడళ్లతోపాటు రహదారి చెంతన పలువురు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. తొలుత తాత్కాలికంగా చిన్నపాటి రేకుల షెడ్‌లను నిర్మించి, తరువాత ఆయా స్థలాల్లో పక్కా భవనాలను నిర్మించి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. మండల పరిధిలోని సుంకరపాలెం పంచాయతీలో జాతీయ రహదారి 216కి ఆనుకుని ఉన్న స్థలాల్లో ఇటీవల అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. కేంద్రపాలిత ప్రాంతమైన యానాంకు తాగునీటి అవసరాల నిమిత్తం గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేటాయించిన 55 ఎకరాల స్థలంలో రెండు భారీ చెరువులను తవ్వారు. ఆ చెరువులకు సంబంధించి జాతీయ రహదారి 216ను ఆనుకుని నిర్మించిన గోడ చెంతన గల స్థలాన్ని ఒక వ్యాపారి ఆక్రమించుకుని దుకాణం నిర్వహిస్తున్నారు. అదే రహదారిలో ఊట కాలువ చెంతన ఇటీవల ఒక దుకాణాన్ని ఏర్పాటు చేశారు. కొంతకాలంగా వ్యాపారాలు సాగిస్తున్నప్పటికీ ఎన్‌హెచ్ అధికారులు పట్టించుకోకపోవడంతో మరికొందరు అక్రమార్కులు ఇటీవలే పక్కనే ఉన్న స్థలంలో నేరుగా గ్రావెల్‌ను దింపి చదును చేశారు. కోట్లాది రూపాయల విలువైన భూమిని అక్రమార్కులు అన్యాక్రాంతం చేస్తున్నప్పటికీ ఎన్‌హెచ్ అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఈ ఆక్రమణలపై పలువురు స్థానిక పంచాయతీ కార్యదర్శి వలీబాబాకు ఫిర్యాదు చేయగా ఆయన సంరక్షణ చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఆక్రమణలో ఉన్న వ్యాపారులకు నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆక్రమణకు గురౌతున్న స్థలాలపై ఎన్‌హెచ్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.



జాతీయ రహదారి సమీపంలో సుంకరపాలెం వద్ద ఆక్రమించుకున్న స్థలంలో వ్యాపారం

కాలువ గట్లనూ వదలని అక్రమార్కులు

అక్రమార్కులు కాలువ, ఏటిగట్లను సైతం ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తున్నారు. కోరంగి పంచాయతీ సీతారామపురంలో ఆత్రేయ గోదావరిని ఆనుకుని పలువురు అక్రమ నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇటీవల సుబ్బారాయుని దిమ్మ ప్రాంతంలో ఒక రేకుల షెడ్ వెలిసింది. ఇటీవల పంచాయతీ అధికారులు ఆత్రేయ గోదావరి చెంతన ఉన్న పలు అక్రమ నిర్మాణాలను తొలగించి మొక్కలు నాటారు. అయినప్పటికీ అక్రమార్కులు ఏ మాత్రం బెదరకుండా అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. మండలంలోని పంట కాలువగట్లు సంగతైతే చెప్పనవసరం లేదు. కాలువ గట్లను దర్జాగా ఆక్రమించుకుని కాలువలపైనే పలు నిర్మాణాలు చేపడుతున్నారు. పంట కాలువ గట్లను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నారు. బహిరంగంగా రహదారులను, పంట, ఊట కాలువలు, ఏటిగట్లను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా ఆయా శాఖల అధికారులు చర్యలు చేపట్టడం లేదు. కాసులకు కక్కుర్తిపడి పలువురు అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి లక్షలాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని జనం కోరుతున్నారు.

ఆక్రమణల తొలగింపు వాయిదా

జాతీయ రహదారి చెంతన ఆక్రమణలు పెరిగిపోవడంతో సంబంధిత అధికారులు గత నెల 20వ తేదీన ఆక్రమణలను తొలగిస్తామని ప్రకటించారు. అయితే పలు కారణాలతో ఈ తొలగింపు ప్రక్రియను వాయిదా వేశారు. దీనిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరుతున్నారు.



జాతీయ రహదారి చెంతన గ్రావెల్‌తో పూడ్చిన విలువైన స్థలం



చింతాకులవారిపేటలో పంట కాలువపై నిర్మించిన దుకాణాలు



సుంకరపాలెం జంక్షన్‌లో హైవే డ్రైనేజీపై వెలసిన దుకాణాలు

అసలే ఇరుకు.. ఆపై ఆక్రమణలు



తాళ్లరేవు కాపు కల్యాణ మండపం వీధిలో ప్రమాదకరంగా నిర్మాణాలు

తాళ్లరేవు: అసలే ఇరుకు రహదారి ఆపై అక్రమ నిర్మాణాలతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రమైన తాళ్లరేవు మండల పరిషత్ కార్యాలయం చెంతన గల కాపు కల్యాణ మండపం వీధిలో పలువురు రహదారిపైనే ర్యాంపులు నిర్మించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. తొమ్మిది అడుగుల రహదారిపై సుమారు ఐదు అడుగుల మేర మెట్ల మాదిరిగా ఆక్రమించి నిర్మించడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళలో పాదచారులు, వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పంచాయతీ అధికారులు దృష్టి సారించి రహదారిపై ఉన్న నిర్మాణాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ

తాళ్లరేవు: మండల పరిధిలోని కాపులపాలెం గ్రామంలో పునర్నిర్మించిన శ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆలమూరు మండలం పెనికేరు గ్రామానికి చెందిన వేద పండితులు బ్రహ్మశ్రీ కాళ్లకూరి దుర్గాప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో టీటీడీ వార్షిక సనాతన పండితులు బ్రహ్మశ్రీ కాళ్లకూరి సూరిబాబు నేతృత్వంలో యంత్ర, శిఖర, రజత, ధ్వజ, తదితర ప్రతిష్ఠా కార్యక్రమాలు ఉదయం 7.53 గంటలకు నిర్వహించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు తదితరులు పూజలు చేశారు. అనంతరం మహా పూర్ణాహుతి, ఆచార్య పూజ, అగ్ని ప్రదక్షిణం, కుంభాభిషేకం, గోదృష్టి ప్రథమ దర్శనం చేసిన అనంతరం భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.



ఆలయానికి పోటెత్తిన భక్తులు

మద్యంతరంగా రోడ్డుపై..



స్థానిక ముమ్మిడివరం గేటు సెంటరు సమీపంలో గురువారం మధ్యాహ్నం ఓ యువకుడు తప్పతాగి ఇలా నడి రోడ్డుపై పడిపోయాడు. 30- 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న ఆ యువకుడు పడి ఉండడాన్ని చూసిన అటుగా రోడ్డుపై వెళుతున్న వారు ఇదేం వైపరీత్యం అనుకున్నారు.

– అమలాపురం టౌన్

124 మంది డీఆర్పీలకు ముగిసిన శిక్షణ

అమలాపురం టౌన్: నూతన విద్యా సంవత్సరానికి ముందస్తు ప్రణాళిక కోసం అమలాపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 124 మంది డీఆర్పీలకు మూడు రోజుల పాటు ఇచ్చిన శిక్షణ గురువారంతో ముగిసిందని డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా తెలిపారు. వీరు అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం డివిజన్ కేంద్రాల్లో ఈ నెల 9, 10, 11 తేదీల్లో 3,200 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ పొందిన డీఆర్పీలకు డీఈవో ధృవీకరణ పత్రాలు అందజేశారు. కోర్సు కో ఆర్డినేటర్ బి.హనుమంతరావు, శిక్షణ తరగతుల ఇన్‌చార్జి, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్‌సీఈఆర్‌టీ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ పవన్ రామ్, డైట్ లెక్చరర్ కె.కృష్ణ సాయి పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న డీఆర్పీలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న డీఈవో బాషా

త్వైకాండో పోటీలకు ఎంపిక

పి.గన్నవరం: కాకినాడలో ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి త్వైకాండో పోటీల్లో ముంగండ గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు బంగారు పతకాలను సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని కోచ్ పి.భార్గవి తెలిపారు. సబ్ జూనియర్ బాలికల 32 కిలోల విభాగంలో వి.రక్షిత, 46 కిలోల విభాగంలో ఎంపీఎస్ లక్ష్మిలు బంగారు పతకాలను సాధించారు. వీరు ఈ నెల 9 నుంచి అనంతపురంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లనున్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

కొత్తపేట: అవిడి రేవు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కొత్తపేట కొప్పిసెట్టివారి వీధికి చెందిన దొంగ వెంకటకృష్ణ అమలాపురం వైపు నుంచి కొత్తపేటకు బైక్‌పై వస్తుండగా అవిడి రేవుకు సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేంద్ర తెలిపారు.

పర్యావరణ వ్యవస్థలను కాపాడుకోవాలి



మహాసభలో మాట్లాడుతున్న పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సర్వేశ్వరశర్మ



ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహిస్తున్న మేజిస్ట్రేట్ శ్రీలేఖ, న్యాయవాదులు



పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ, ఎమ్మెల్యే, ఆర్డీవో తదితరులు

> కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సర్వేశ్వరశర్మ

అమలాపురం టౌన్: పర్యావరణ వ్యవస్థలను మనం నిర్లక్ష్యం చేయడం వల్లే మనకు ప్రకృతి పరంగా అనేక నష్టాలు అనివార్యమవుతాయని, ఆ వ్యవస్థలను మనం కాపాడుకున్నప్పుడే సమతుల్యమైన వాతావరణం సాకారమవుతుందని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన పరిషత్ 2916వ మహాసభలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడమే లక్ష్యంగా ఈ ఏడాది పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హేతువాద సంస్థ అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ విచక్షణ రహితంగా చంపేయడం వల్ల పర్యావరణానికి ఉపయోగ పడే అనేక జీవుల మనుగడ ప్రశ్నార్థకమవుతోందన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో కళాశాల తెలుగు అధ్యాపకుడు మంగం శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ

అమలాపురం టౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల లీగల్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు భవనాల సముదాయం నుంచి నల్ల వంతెన వరకు ప్లాస్టిక్ నిషేధంపై గురువారం ఉదయం అవగాహన ర్యాలీ జరిగింది. మేజిస్ట్రేట్ సుంకర శ్రీలేఖ, బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు, లీగల్ వలంటీర్లు ఈ ర్యాలీలో పాల్గొని ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని విడనాడాలని నినాదాలు చేశారు. ర్యాలీకి ముందు స్థానిక కోర్టు భవనాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, కోశాధికారి ఎస్ సీహెచ్ వెంకటేశ్వరరావు ర్యాలీలో పాల్గొన్నారు. అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు స్థానిక డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఉద్యాన వనంలో పూలు, పండ్లు మొక్కలు నాటారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు పాల్గొన్నారు.

అవగాహనతో కాలుష్యం అంతం

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అవగాహనతో అంతమొందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) టి.నిషాంతి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గడియారం స్తంభం సెంటరులో గురువారం జరిగిన పర్యావరణ పరిరక్షణ సభకు జేసీ నిషాంతి అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతీ ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే మార్గాలను అన్వేషించి ప్రత్యామ్నాయ మార్గాలను ఆచరించాలని సూచించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ ప్రకృతిని మనం కాపాడితే అదే ప్రకృతి మనల్ని కాపాడుతుందని చెప్పారు. అనంతరం పట్టణం పలుచోట్ల జేసీ, ఎమ్మెల్యేతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఆర్డీవో కొత్తపల్లి మాధవి, మున్సిపల్ కమిషనర్ రాణి మొక్కలు నాటారు.

ఘనంగా వన మహోత్సవం

అల్లవరం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వన మహోత్సవం పురస్కరించుకుని వాడవాడలా మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో అల్లవరం గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి ముఖ్యఅతిథులుగా హాజరై మొక్కలను నాటారు. ఎంపీపీ మాట్లాడుతూ మొక్కలను నాటి వాటి పోషణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. దేవగుప్తంలో సర్పంచ్ సాధనాల వెంకటరావు ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని నిర్వహించి దేవగుప్తం ఉన్నత పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఎంపీటీసీ సభ్యుడు రాంబాబు, గుబ్బల నాగేశ్వరరావు, పోతుల నాగరాజు, ఎంపీడీఓ కృష్ణ మోహన్, ఎంఈఓలు కిరణ్‌బాబు, ఏడుకొండలు, ఏపీఓ రాజామణి పాల్గొన్నారు.

హరితాంధ్రప్రదేశ్‌లో భాగంగా...

అమలాపురం రూరల్: హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా అమలాపురం రూరల్ మండలం కామనగరువు గ్రామంలో గురువారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మొక్కలు నాటారు. డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, సర్పంచ్ నక్కా అరుణకుమారి, మాజీ సర్పంచ్ రాజులపూడి భీముడు, ఏపీడీ రాంబాబు పాల్గొన్నారు.

మహిళలకు మొక్కలు, బ్యాగులు అందజేత

అమలాపురం రూరల్: పర్యావరణ దినోత్సవం సందర్భంగా కామనగరువులో స్నేహిత స్వచ్ఛంద సేవా సంస్థ ఆఫీసు వద్ద గురువారం స్నేహిత సంస్థ అధ్యక్షురాలు కుంచే స్వర్ణలత మహిళలకు మొక్కలు, బ్యాగులు అందజేశారు. రెడ్డిపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కరాటం రత్న ప్రసన్న, ఎంపీటీసీ సత్తి అదిలక్ష్మి, నాయకులు కొలిశెట్టి ప్రకాష్ మొక్కలు నాటారు. పేరూరు గ్రామపంచాయతీ లంకతోట, న్యూ కాలనీ ప్రాంతాల్లో సర్పంచ్ దాసరి అరణ మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

యానాం: పర్యావరణ పరిరక్షణ ద్వారానే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని ఆర్‌ఏవో మునిస్వామి పేర్కొన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రముఖకవి కలైమామణి దాట్ల దేవదానంరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ముమ్మిడివరం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం,వన మహోత్సవం సందర్భంగా నగర పంచాయతీ పరిధి బాలయోగీశ్వరుల తపో ఆశ్రమం వద్ద చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద పాల్గొన్నారు.

తాగునీరు కలుషితమైందంటూ గ్రామస్తుల ఆందోళన



చల్లపల్లిలో మురుగునీరు చూపుతూ నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామ పంచాయతీ రాయి చెట్టు వీధిలో కొన్ని రోజులుగా తాగునీరు కలుషితమై కుళాయిల్లో మురుగునీరు వస్తోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని రాయి చెట్టు సెంటర్లో టెంట్ వేసి మురుగునీరును బాటిళ్లలో చూపుతూ గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఫిల్టర్ బెడ్‌లు పాడవటంతో గ్రామంలో ఉన్న పంచాయతీ ప్రాజెక్ట్ నుంచి కొన్ని రోజులుగా మురుగు నీరు సరఫరా అవుతోందని, దీనిపై పంచాయితీ అధికారుల పర్యవేక్షణ కరవయ్యిందని ఆరోపించారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.సురేష్‌ను వివరణ కోరగా ఫిల్టర్‌లు మార్చి గ్రామ ప్రజల ఇబ్బందులు తీర్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతానికి తాత్కాలికంగా అదే గ్రామంలో ఉన్న సీడబ్ల్యూపీసీ ప్రాజెక్ట్ నుంచి తాగునీరు అందేలా తాత్కాలికంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలిశెట్టి బుజ్జి, పోలిశెట్టి వెంకన్నబాబు, భోగిశెట్టి నరసింగరావు, సుంకర చిన్నబ్బాయి, సుంకర వీరబాబు, నాగులపల్లి మహిధర్ ఉన్నారు.

ఫార్మసిస్ట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరి వైద్యశాఖలో ఖాళీగా ఉన్న 43 ఫార్మసిస్ట్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పుదుచ్చేరి ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ గురువారం ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే దరఖాస్తులు ఆరోగ్యశాఖ వెబ్‌సైట్‌లో పెట్టినట్లు, వాటిని డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 24 లోగా పంపాలని కోరారు. రాతపరీక్షను జూలై 13న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనరల్ కేటగిరికి-17, ఎంబీసీ-8, ఎస్సీ-7, ఓబీసీ-5, ఈడబ్ల్యూఎస్-4 , ఈబీసీ-1, ముస్లిం-1 పోస్టులు భర్తీ చేస్తామన్నారు.

చిత్రం... సందేశం



సంగీత్ గీసిన చిత్రం

మలికిపురం: మానవుని మనుగడకు చెట్లు ఆధారం. సృష్టిలోని ప్రతి జీవరాశి ప్రకృతి మీదే ఆధారపడి జీవిస్తుందని స్థానిక సునయన ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ నల్లి సంగీత్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగీత్ పర్యావరణం పరిరక్షణకు వివిధ చిత్రాలను చిత్రీకరించారు. తన అకాడమీ విద్యార్థులకు ప్రదర్శన ఇచ్చారు. ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను చిత్రాలు గీసి సృజనాత్మకంగా వివరించారు.